ప్రజాశక్తి

శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





నేతన్నలకు ఇచ్చిన
హామీల అమలెప్పుడో.?

- నెరవేరని ఉచిత విద్యుత్తు హామీ
- జీవో వచ్చినా అమలుకు నోచని వైనం
- కలగానే 'చేనేత పార్కు' ఏర్పాటు



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా చీరాల వచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు చేనేతల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక హామీలు ఇచ్చారు. చేనేతలకు ఉచిత విద్యుత్తు ఇస్తానన్నారు. చీరాలలో చేనేత పార్కు ఏర్పాటుకూ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు పర్యాయాలు జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు జరిగాయి. బాపట్ల జిల్లా స్థాయిలో జరిగిన ఈ రెండు వేడుకలు చీరాల నియోజకవర్గం, జాండ్రపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగాయి. ఈ రెండు వేడుకల్లోనూ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పాల్గొన్నారు. చేనేతల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం కషి చేస్తోందని, ఇందుకోసం పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలకు మేలు కలిగేలా నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టామన్నారు. చేనేతల ఉచిత విద్యుత్ పథకం ద్వారా ఏడాదికి మగ్గాలపై నేసే నేతన్నలకు రూ.15 వేలు, మర మగ్గాలపై ఆధారపడిన వారికి రూ.32 వేలు ఆదా అవుతుందన్నారు. నేతన్న భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.25 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. చేనేత వస్త్రాలపై 5 శాతం రీయింబర్స్‌మెంట్, త్రిఫ్ట్ నిధులు మంజూరు చేశామన్నారు. ఇదే తీరున గతేడాది జరిగిన చేనేత దినోత్సవ సభలో కూడా మంత్రి సవిత పలు హామీలిచ్చారు. చీరాలలో చేనేత పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. ఆన్ లైన్ మార్కెటింగ్ ప్రారంభిస్తామని, నేతన్నల కోసం నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, 365 రోజులపాటు చేనేతలకు పని కల్పిస్తామని చెప్పారు. వారు నేసిన వస్త్రాలకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని, డిజైన్ల కోసం ప్రత్యేక శిక్షణలు ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి మాటగా గొప్పగా ఆనాటి సభలో ▶ 2లో

ప్రజల కలలపై
ప్రైవేటు పడగ.!

- మార్కాపురం వైద్య కళాశాలకూ పీపీపీ మోడ్‌లో టెండర్..
- వైద్యరంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకేనంటున్న విపక్షాలు
- ప్రభుత్వమే నిర్మాణ బాధ్యత చేపట్టాలని డిమాండ్



మార్కాపురం మెడికల్ కళాశాల...

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నిర్మాణంలో ఉన్న మార్కాపురం మెడికల్ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ మోడ్‌లో అప్పగించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రూ.475 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు ఇప్పుడు పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతిలో నిర్మించే దిశగా గురువారం టెండర్ ప్రక్రియ ▶ 2లో

ప్రైవేటు నీడ పడకూడదు..

డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే



మార్కాపురం వంటి వెనుకబడిన ప్రాంతంలో మెడికల్ కాలేజీ అంటే కేవలం విద్యాసంస్థ కాదు.. ప్రజలకు ప్రాణాధారం. వందల కిలోమీటర్ల దూరంలో గుంటూరు, ఒంగోలు, కర్నూలు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి మారుతుందని ప్రజలు ఆశపడ్డారు. కానీ ప్రభుత్వాలు మారడం, విధానాలు మారడం వల్ల ఆ కలలు మాయమవుతున్నాయి. ప్రజల డిమాండ్ ఒకటే – ఇప్పటికే ప్రారంభమైన ప్రాజెక్టును ప్రభుత్వమే పూర్తి చేయాలి. పీపీపీ మోడల్ పేరుతో ప్రజల కలలపై ప్రైవేటు నీడ పడనివ్వకూడదు.

ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి..

ఎస్‌కె.మాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి



మార్కాపురం మెడికల్ కాలేజీని గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు నాబార్డు నిధులతో నిర్మాణ, నిర్వహణ బాధ్యతలు చేపట్టాలి. ఏ రాజకీయ పార్టీ కూడా సొంత నిధులు వెచ్చించదు. కేంద్ర నిధులు, గ్రాంట్ ఏవయినా ప్రజాధనమే. రాజకీయాలతో వివాదాస్పదం చేయకుండా వచ్చే విద్యా సంవత్సరానికి పూర్తి చేయాలి. వీలయితే 100 శాతం వైద్య సీట్లు కన్వీనర్ కోటాగా మార్చాలి.

పీపీపీ అంటే ప్రైవేటీకరించడమే..

ఎంఎల్.నారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి



వైద్య కళాశాల విషయంలో పీపీపీ అంటే వైద్య రంగాన్ని ప్రైవేటీకరించడమే. వెనుకబడిన ప్రాంతంలో వైద్యం, వైద్య విద్య ప్రైవేట్ చేయడం అంటే ఆ ప్రాంత ప్రజలను నిర్లక్ష్యం చేయడమే. వెనుక బడిన ప్రాంతాన్ని అభివద్ధి చేస్తామన్న ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణం, నిర్వహణ చేపడితేనే ఆ ప్రాంత వాసులకు మేలు జరుగుతుంది. ఇప్పటికే వెనుకబడిన ప్రాంతంలో వైద్యం, వైద్య విద్య కొనుగోలు చేయడం సాధ్యం కాదు.

'వెలిగొండ'పై మాట్లాడతారా.?

- సాగునీటి ప్రాజెక్టులు గట్టెక్కేనా..?
- నేడు జలవనరులపై అసెంబ్లీలో చర్చ



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచీ ప్రారంభమయ్యాయి. పాలకపక్ష సభ్యులు హాజరు కాగా.. వైసిపి ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. అయితే సమావేశాలు ఈ నెల 30 వరకూ జరగనున్నాయి. రోజువారీగా చర్చించాల్సిన అంశాలపైనా బీఏసీ సమావేశంలో ఓ నిర్ణయానికి వచ్చారు. తొలిరోజున సభలో ఎమ్మెల్యేలు ఎవరూ జిల్లా సమస్యలపై మాట్లాడే అవకాశం రాలేదు. విద్యుత్‌శాఖకు సంబంధించి వచ్చిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానాలు ఇచ్చారు. జీఎస్‌టీపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడారు. శుక్రవారం నాడు జలవనరుల శాఖపై చర్చ ఉంది. దీనిపైనే జిల్లా ఎమ్మెల్యేలు గళం విప్పాల్సిన అవసరం ఉంది. పశ్చిమ ప్రాంత ఎమ్మెల్యేలకు కీలక ఎజెండా వెలిగొండ ప్రాజెక్టు. దీన్ని వచ్చే సీజన్ నాటికి పూర్తి చేస్తామని సిఎం చంద్రబాబు జిల్లా పర్యటనల్లో ప్రకటించిన సంగతి తెలిసిందే.

వచ్చే జూన్ నాటికి అంటే ఏడాది కూడా సమయం లేదు. ఇప్పుడు దీనిపై మాట్లాడాల్సిన అవసరం కీలకంగా ఉంది. ఎందుకంటే దీనికి భారీగా నిధులు కావాలి. వచ్చే పంట సీజన్‌కు మొదటి దశను పూర్తిచేయాలని నిర్ణయించారు. అంటే మొదటి సొరంగం ద్వారా 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. తాగునీటి పథకాలూ ఉన్నాయి. అన్నింటికీ మించి దీనికి నిధులు కీలకం. నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వాల్సి ఉంది. పునరావాసం కల్పించాలి. ముంపు గ్రామాలను అక్కడ నుంచీ ఖాళీ చేయించాలి. ఈ ప్రక్రియ వేగంగా జరగాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ ప్యాకేజీలపై చర్చే లేదు. నీళ్లిస్తామని ప్రకటించడం తప్ప దానికి తగిన కార్యాచరణ మాత్రం కనిపించడం లేదు. గత ప్రభుత్వమైతే ఏకంగా నిర్వాసితులను పూర్తిగా వదిలేసి రెండు సొరంగాలను ప్రారంభించింది. అప్పటి సిఎం జగన్ ఎన్నికల్లో లబ్ధి కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికీ ప్యాకేజీలు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక తొలిఏడాదిలో పూర్తిచేస్తామని ప్రకటించినా ఆచరణలో సాధ్యం కాలేదు. ఇప్పటికీ పనులు వేగంగా లేవు. అరకొరగా పనులు చేపడుతున్నారు. సొరంగాల్లో పనులు పూర్తిచేయాల్సి ఉంది. కాలువలను పూర్తిచేయాలి. సొరంగం నుంచి రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాలువ పలుచోట్ల దెబ్బతింది. దీన్ని కూడా బాగుచేయాల్సి ఉంది. వచ్చే సీజన్‌కు నీళ్లిచ్చేందుకు అవసరమైన పనులు మాత్రం ప్రస్తుతం కనిపించడం లేదు. పైగా పలు నియోజకవర్గాల్లో తాగునీటి పథకాలన్నీ వెలిగొండపైనే ఆధారపడ్డాయి. ఇంటింటికీ కుళాయిల పథకం కూడా దీనిపైనే నడవాలి. కనిగిరి, గిద్దలూరు వంటి నియోజకవర్గాల్లో వెలిగొండ ఆధారంతోనే తాగునీటి లక్ష్యాలున్నాయి. అక్కడ ప్రజానీకం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లోనూ వెలిగొండపైనే అందరూ హామీలు గుప్పించారు. రెండో ఏడాదిలోకి అడుగుపెట్టినా దీనిపై శ్రద్ధ కనిపించడం లేదు. ప్యాకేజీలకు రూ.1000 కోట్ల మేరకు నిధులు కావాలి. పునరావాసం పూర్తిచేయాలి. ఇవన్నీ పూర్తికావాలి. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో దీనిపైనా, దీని అవసరాలపైనా ఎవరు గళం విప్పుతారన్నదీ చూడాలి. మిగతా సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కావాలి. గుండ్లకమ్మ గేట్ల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టాలి. కాలువలను మరమ్మతులు ▶ 2లో

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు
సమిష్టిగా పనిచేద్దాం..

8లో ▶



తీరం వద్ద పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బీచ్ ఫెస్టివల్ వేడుకలకు
తీరంలో పటిష్ట బందోబస్తు

ఎస్పీ బి.ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బీచ్ ఫెస్టివల్ వేడుకలకు సూర్యలంక సముద్రతీరంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ నెల 26, 27, 28 తేదీలలో సూర్యలంక సముద్రతీరంలో జరగనున్న బీచ్ ఫెస్టివల్ వేడుకలలో పాల్గొనేందుకు ఈ నెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లా సూర్యలంకకు వస్తున్న నేపథ్యంలో యాత్రికుల వాహనాల పార్కింగ్, వీఐపీ వాహనాల పార్కింగ్, కాన్వాయ్ ప్రయాణించే మార్గం, సభా వేదిక, స్టాల్స్ ఏర్పాటు చేసే ప్రదేశాన్ని, హెలీప్యాడ్, సూర్యలంక మెరైన్ పోలీస్‌స్టేషన్‌లను ▶ 2లో

ప్రజల కలలపై ప్రైవేటు పడగ..

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టడంపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఇది వైద్యరంగాన్ని ప్రైవేటీకరణ చేసే కుట్ర అని వారు విమర్శిస్తుండగా, ప్రభుత్వం మాత్రం సేవకు భంగం కలగదని, పేదలకు ఉచిత వైద్యం అందుతుందని వాదిస్తోంది. ఇంతకీ పీపీపీ పద్ధతిలో కాలేజీలు అప్పగిస్తే ఎవరికి లాభం? ఎవరికి నష్టం? అన్నది సామాన్యుడి ప్రశ్నగా మారింది.

ప్రభుత్వ వర్సెస్ ప్రైవేటు కాలేజీలు-స్పష్టమైన తేడా..

ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనుబంధ ఆసుపత్రుల్లో సాధారణ ప్రజలకు పూర్తిగా ఉచితంగా వైద్యం అందుతుంది. విద్యార్థుల విషయానికొస్తే, ఫీజులు వేలల్లోనే ఉండటంతో ఎస్సీ, ఎస్టీ, మధ్య తరగతి, పేద వర్గాల పిల్లలు కూడా ఎంబీబీఎస్ చదవగలుగుతారు. కానీ ప్రైవేటు మెడికల్ కాలేజీ పరిస్థితి భిన్నం. ఆసుపత్రిలో వైద్యానికి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తారు. ఇక్కడ చదువుకోదలచిన విద్యార్థులు కన్వీనర్ సీటుకే రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉంటుంది. వైద్య విద్య పూర్తయ్యే సరికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఖర్చవుతుంది. ఫలితంగా తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు వైద్య విద్యకు దూరమవుతారు.

సీట్ల కేటాయింపు వివాదం..

ఇక సీట్ల విషయంలో కూడా ప్రభుత్వాల వైఖరి ప్రశ్నార్థకమే. గత వైసీపీ ప్రభుత్వం 2023లో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీల్లో 50% సీట్లు మేనేజ్‌మెంట్ కోటాకు కేటాయించారు. అందులో 35 శాతం సెల్ఫ్ ఫైనాన్స్ (రూ.12 లక్షలు ఫీజు), 15 శాతం ఎన్ఆర్ఐ (రూ.20 లక్షలు ఫీజు) కింద ఇచ్చారు. ప్రస్తుత ప్రతిపాదనలతో సగం సీట్లు కాదు, మొత్తం సీట్లు ప్రైవేటు ఆధీనంలోకి వెళ్తాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అంటే పీపీపీ పద్ధతి వైద్య విద్యార్థులపై మరింత భారంగా మారుతుంది.

మార్కాపురం మెడికల్ కాలేజీ - నిరాశ..

2021 ఫిబ్రవరి లో జగన్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు మార్కాపురంలో మెడికల్ కాలేజీకి అనుమతి తెచ్చింది. 50 ఎకరాలకు పైగా స్థలంలో రెండేళ్ల తరువాత రూ.475 కోట్ల ఆర్ఐడిఎఫ్ 28 నిధులతో (నాబార్డ్ ఋణం) 500 పడకల ఆసుపత్రి, 150 సీట్ల మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టారు. మేఘా ఇన్ఫ్రా సంస్థకు రూ.334.45 కోట్లకు 2023 మార్చి నెలలో కాంట్రాక్టు దక్కించుకుని 2025 జూలైలోగా పూర్తి చేయాలని ఒప్పందం కుదుర్చుకుంది. గత ఎన్నికల నాటికి 40 శాతం- 50 శాతం భవన నిర్మాణం పూర్తయింది. కానీ కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఈ ప్రాజెక్టును కొనసాగించకుండా మధ్యలోనే రద్దు చేసి, తాజాగా పీపీపీ మోడ్ లో తిరిగి ప్రారంభించాలన్న నిర్ణయం తీసుకోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒప్పంద గడువు ముగియకముందే రద్దు..

కాంట్రాక్ట్ గడువు 2025 జూలై వరకు ఉన్నా, కూటమి ప్రభుత్వం మధ్యలోనే కాంట్రాక్టు రద్దు చేసింది . చేసిన పనులకు సుమారు రూ.90 కోట్లు గుత్తేదారుకు చెల్లించినట్లు సమాచారం. ఇక్కడ 22 విభాగాలకు నియమించిన 79 మంది బోధనా వైద్యులు, ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను కొత్త ప్రభుత్వం 2024 డిసెంబర్ కాబినెట్ నిర్ణయంతో వారిని వేరే కళాశాలలకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. కాంట్రాక్టు సిబ్బందిని తొలగించారు. పారామెడికల్ నియామకాలు నిలిచిపోయాయి.

'వెలిగొండ'పై మాట్లాడతారా.?

(మొదటిపేజీ తరువాయి)

చేసి ఆయకట్టులో చివరివరకూ నీటి సరఫరా చేయాల్సి ఉంది. ఇక చాలాకాలంగా పెండింగులో ఉన్న ప్రాజెక్టులపై స్పష్టత లేదు. పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి కాలేదు. శింగరకొండ వద్ద చెరువును రిజర్వాయర్‌గా మార్చాలనే ప్రతిపాదన చాలా కాలంగా ఉంది. ఈ రెండూ మంత్రి గొట్టిపాటి నియోజకవర్గంలో ఉన్నాయి. మంత్రి డోలా వీరాంజనేయస్వామి నియోజవర్గంలోనూ సంఘమేశ్వర ప్రాజెక్టు పెండింగ్‌లో ఉంది. దీన్ని పూర్తిచేస్తామని ఎన్నికల్లో వాగ్దానాలు చేశారు. చాలాకాలంగా ఇది పెండింగ్ ప్రాజెక్టుగా ఉంది. చిన్ననీటి వనరులపై దృష్టి సారించాలి. ఏదేమైనా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపైనా, వాటి నిధులు, అవసరాలపైనా అసెంబ్లీలో జిల్లా ఎమ్మెల్యేలు గళం విప్పుతారని ఆశిద్దాం..

రేపు రైతు సంఘం మహాసభ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఎపి రైతు సంఘం మండల మహాసభ ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు పెద్దదోర్నాలలోని శివ సదనంలో జరుగుతుందని ఆ సంఘం నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ మహాసభలు జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పెద్దదోర్నాలలో సన్నాహ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం కావడంతో రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. మొదటి సొరంగం ద్వారా నీటిని విడుదల చేసేందుకు అవసరమైన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నిర్వాసితులకు ప్యాకేజి ఇవ్వాలన్నారు. యూరియా కొరత ఏర్పడిందన్నారు. కనీసం ఎరువులు కూడా అందుబాటులో ఉంచలేదన్నారు. పంట దిగుబడులకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో జరుపుతున్న ఎపి రైతు సంఘం మండల మూడవ మహాసభలు ప్రాధాన్యత సంతరించుకున్నాయన్నారు. మండలంలోని రైతులు ఈ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య, రైతు సంఘం మార్కాపురం మండల కార్యదర్శి గంగిరెడ్డి రాజశేఖరరెడ్డి, సిఐటియు మండల నాయకులు పానుగంటి పిచ్చయ్య పాల్గొని మాట్లాడారు.

కిశోర బాలికలకు బ్రష్‌లు, పేస్టులు పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంతనూతలపాడు ప్రభుత్వ హాస్పిటల్‌లో గురువారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో సంతనూతలపాడు వాసవి క్లబ్, మహిళా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఒంగోలుకు చెందిన దాత పబ్బిశెట్టి ఆంజనేయులు అందించిన టూత్ బ్రష్‌లు పేస్టులను వందమంది కిషోర్ బాలికలకు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి మహిళాక్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి కిశోర బాలికలకు వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో మెడికల్ ఆఫీసర్ బి. సుధామణి, ఎంపీడీవో డిఎస్‌వి ప్రసాద్, ఎంపీపీ బుడంగుంట విజయ, జడ్పిటిసి దుంపా రమణమ్మ, గ్రామ సర్పంచ్ దర్శి నాగమణి, వైద్యులు నాగరాజు, శ్రీధర్, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కరుణాకర్‌రావు, సిహెచ్ఓ మాధవరావు, వాసవి క్లబ్ సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, కోశాధికారి పామిడి సుధాకర్, వాసవి మహిళా క్లబ్ సెక్రటరీ శిఘాకొల్లి జయశ్రీ, కోశాధికారి జి శ్రీలక్ష్మి, కిశోర బాలికలు, వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేతన్నలకు ఇచ్చిన.. హామీల అమలెప్పుడో.?

(మొదటిపేజీ తరువాయి)

హామీ ఇచ్చారు. కానీ ఏడాది కాలం గడిచినా ఇవేవీ ఆచరణకు నోచుకోకపోవడం శోచనీయం.

చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు విషయమై ఈ ఏడాది మార్చి 26వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 83 వేల మంది చేనేత కార్మికులకు 200 యూనిట్‌ల ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నట్లు ఈ జీవోలో చెప్పారు. బాపట్ల జిల్లాలో 5,885 మంది చేనేతలు ఈ ఉచిత పథకానికి అర్హులుగా ఉన్నట్లు చేనేత జౌళి శాఖ అధికారులు నివేదిక పంపారు. కానీ నేటికీ చేనేతల ఉచిత విద్యుత్ అందుబాటులోకి రాలేదు. గత నెలలో జరిగిన చేనేత దినోత్సవ సభలో ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. దీని ప్రకారం ఈనెల జిల్లాలోని 5,885 మంది చేనేతల కుటుంబాలకు జీరో బిల్లు రావాలి. కానీ అదేమి జరగలేదు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఎలా అయితే ప్రతి నెలా ఇచ్చే విద్యుత్ బిల్లులో జీరో బిల్లు ఇస్తున్నారో అదే రీతిలో చేనేతలకు జీరో బిల్లు ఇవ్వాలి. హామీ ఇచ్చారు.. జీవో తెచ్చారు.. కానీ ఉచిత విద్యుత్ పథకం అమలు కాలేదు. నేటికి కూడా ఇటు చేనేత, జౌళి శాఖకు గానీ, అటు విద్యుత్ శాఖ అధికారులకు గానీ ఈ విషయమై ఎలాంటి స్పష్టత ప్రభుత్వం నుంచి లేదు. నేతన్న భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.25 వేలు ఇచ్చే హామీ కూడా అమలు కాలేదు. చీరాలలో చేనేత పార్కు ఏర్పాటుకు కావలసిన స్థలం కూడా అందుబాటులో ఉంది. కానీ ఏడాది కాలంగా డిపిఆర్ తయారీలోనే చేనేత పార్కు ఉంది. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు యార్న్‌సబ్సిడీ, మార్కెటింగ్ డెవలప్‌మెంట్ అస్యూరెన్స్ (ఎం.ఓ.ఎ.), పావలా వడ్డీ తదితర రాయితీలను, రిబేటు బకాయిలను ప్రభుత్వాలు ఇస్తుండేవి. గత తెలుగుదేశం ప్రభుత్వ కాలంలోనే 2018 నుండి ఆపివేశారు. మొత్తంగా రూ.156 కోట్లు ఉండే ఈ రాయితీ బకాయిలను వై.సి.పి. ప్రభుత్వం నిలిపి వేయగా, కూటమి ప్రభుత్వం కూడా ప్రకటించి కూడా నేటికీ విడుదల చేయలేదు. సహకార సంఘాలకు సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిలిచిపోవటంతో పాటు, ఆప్కో నుంచి రావలసిన బకాయిలు కూడా రాక సహకార సంఘాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక చేనేత కార్మికుల త్రిఫ్ట్ ఫండ్ కంట్రిబ్యూషన్ రూ.5 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. కానీ నిధులేమీ రాలేదు. ఇప్పటికే హామీల అమలులో తీవ్రజాప్యం నెలకొన్న నేపథ్యంలో చేనేతలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని నేతన్నలు కోరుతున్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు తమ వంతు కృషి చేయాల్సి ఉంది.

బీచ్ ఫెస్టివల్ వేడుకలకు తీరంలో పటిష్ట బందోబస్తు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ఎస్పీ గురువారం పరిశీలించారు. బీచ్ ఫెస్టివల్ వేడుకలను చూసేందుకు వచ్చే యాత్రికుల వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని మరింతగా విస్తరించవలసిన అవసరం ఉందని అధికారులకు ఎస్పీ తెలిపారు. వాహనాల పార్కింగ్ ప్రాంతాన్ని సెక్టార్లుగా విభజించుకుని ఆ సెక్టార్‌లోకి వెళ్లే వాహనం వచ్చే వాహనాలకు అంతరాయం కలగకుండా తగిన విధంగా మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విఐపి కాన్వాయి ప్రయాణించే మార్గం, సభా వేదికను పరిశీలించారు. ఆ ప్రదేశాలలో తీసుకోవలసిన భద్రతాపరమైన చర్యల గురించి అధికారులకు వివరించారు. సూర్యలంక సముద్ర తీరాన్ని పరిశీలించి బీచ్ ఫెస్టివల్‌కు యాత్రికులు అత్యధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున దానికి అనుగుణంగా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న 15 మంది గజ ఈతగాళ్లతో పాటు మరి కొంతమందిని నియమించుకోవాలన్నారు. నిర్దిష్ట లోతులలో జెండాలు ఏర్పాటు చేసి అక్కడ పడవలలో పోలీసులు గజఈతగాళ్లతో గస్తీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీస్ పెట్రోలింగ్ నిరంతరం జరిగే విధంగా చూడాలన్నారు. పర్యాటక, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా వ్యవహరిస్తూ బీచ్ ఫెస్టివల్ వేడుకలు చూసేందుకు వచ్చే యాత్రికలకు ఏటువంటి అసౌకర్యం తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన జరిగే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి జి రామాంజనేయులు, ఎస్బి ఇన్స్పెక్టర్ జి.నారాయణ, బాపట్ల రూరల్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎంఇఒకు వినతి

ప్రజాశక్తి-శింగరాయకొండ : ఉపాధ్యాయుల సమస్యలపై మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసరావుకు టీచర్స్ జేఏసీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ సంపాదిత సెలవులు, 30 సంవత్సరాల ఎఎఎస్, బదిలీ ఉపాధ్యాయుల సమస్యలపై, పిఎఫ్ షెడ్యూల్ వివరాలు అప్‌డేట్ చేసి సేవా పుస్తకంలో నమోదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి స్పందిస్తూ తక్షణమే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కొల్లూరు వెంకయ్య, మండల అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జలకం ప్రభాకర్, ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు కటకం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శ్యామల సుధాకర్‌రెడ్డి, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అర్రిబోయిన రాంబాబు, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు, ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, కీర్తి శ్రీనివాసరావు, సీనియర్ సంఘ నాయకులు అంబటి బ్రహ్మయ్య, పూర్ణచంద్రరావు, రామకష్ణారెడ్డి పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-టంగుటూరు : టంగుటూరులోని బుచ్చి రాజుపాలెం కొత్త కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మానానికి ప్రముఖ పారిశ్రామిక బెల్లం జయంత్ బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మద్దిరాల మమత , మాజీ ఎంపిపి, టిడిపి అధ్యక్షుడు చదలవాడ చంద్రశేఖర్ , టిడిపి నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ మక్కెన హరి బాబు, మక్కెన కోటేశ్వర రావు, మద్దిరాల వెంకట్ రావు, పంచాయితీ ఇఒ హరి బాబు, బొడ్డు సాగర్, బొడ్డు అనీల్, పారబత్తిన ఆనంద్, పారబత్తిన సునీల్, కనమల సర్దార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా 'వెదురు' దినోత్సవం

ప్రజాశక్తి - కనిగిరి

కనిగిరి పట్టణంలోని గార్ల పేట రోడ్డులో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ వెదురుకు 'ఆకుపచ్చ బంగారం' అనే మరో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్ హెల్ప్ రమేష్ బాబు, స్థానికులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరనకు వ్యతిరేకంగామార్కాపురంలో నిర్వహింస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని చలో మెడికల్ కాలేజీ వాల్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, డాకా పిచ్చిరెడ్డి, మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బత్తిన మనోహర్, మారంరెడ్డి గంగాధర్‌రెడ్డి, యనమల మాధవి, పొన్నలూరు జడ్‌పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, వైసిపి టంగుటూరు మండల అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, కొండపి మండల అధ్యక్షుడు బచ్చల కోటేశ్వరరావు, పొన్నలూరు మండల అధ్యక్షుడు సుద్దుగుంట మల్లికార్జున, జరుగుమల్లి మండల అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు నేర్చుకోవాలి

ప్రజాశక్తి - పిసిపల్లి : డ్వాక్రా గ్రూపు మహిళలందరూ అక్షరాస్యులుగా తయారు కావాలని ,వేలిముద్రలు కాకుండా సంతకాలు చేయాలని ఎంపిడిఒ హనుమంతరావు తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఉల్లాస్ అక్షర ఆంధ్ర రెండో విడత శిక్షణా కార్యక్రమం ఎపిఎం జి.సత్యానందం అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే అక్షరాస్యులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు ధర్మతేజ, వయోజన విద్య సూపర్‌వైజర్ వెంకటేశ్వర్ రెడ్డి, సిసిలు గీతమ్మ ,శశిరేఖ భ్రమరాంబ పాల్గొన్నారు.

పాకల హైస్కూల్‌లో కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడుపై విచారణ కొనసాగుతూనే ఉంది. పాఠశాలలో పనిచేస్తున్న లెక్కల ఉపాధ్యాయుడు సిద్దు నాగ వెంకట ప్రసాద్ లీలల గురించి ప్రజాశక్తి లో వచ్చిన అశ్లీల బోధన..? అనే కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసరావు విచారణ జరిపారు. గురువారం డిప్యూటీ విద్యాశాఖ అధికారి చంద్రమౌలేశ్వరరావు ఆధ్వర్యంలో పాకల జిల్లా పరిషత్ హై స్కూల్ ను సందర్శించి అక్కడ విద్యార్థినీ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ పెడుతున్నామని. మీకు ఏమి జరిగినా కాగితం రాసి ఆ బాక్స్ వేయాలని తెలిపారు. పోలీసులు సమక్షంలో ఆ ఫిర్యాదును తీసుకుంటామన్నారు. విద్యార్థులు విద్యాశాఖ అధికారులకు వివరాలు చెప్పేందుకు భయపడటంతో విద్యాశాఖ అధికారులు ఫిర్యాదు బాక్స్‌ను అక్కడ పెట్టి అన్ని విషయాలు కాగితంపై రాసి అందులో వేయాలని తెలిపారు. డిప్యూటీ విద్యాశాఖ అధికారి చంద్ర మౌలేశ్వరరావు విద్యార్థులతో మాట్లాడారు.(పధానోపాధ్యాయుడు డివిఎస్ ప్రసాద్‌తో మాట్లాడి పాఠశాలలో జరుగుతున్న విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డిప్యూటీ డిఇఒచంద్రమౌలేశ్వరరావు

రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కొండపి

.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల మూడవ మహాసభ మండల పరిధిలోని పెరిదేపి గ్రామంలో గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా సానా శ్రీనివాస్ రెడ్డి, ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, కోశాధికారిగా పుట్టా రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు ఎర్ర తివాచి పరిసి స్వాగతం పలుకుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. పొగాకు బోర్డు అధికారులు రైతుల పక్షాన నిలబడి లో గ్రేడు రకం పొగాకు ధరలు పెంచే విధంగా ప్రయత్నం చేయాలని మండల మహాసభ డిమాండ్ చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో తొట్టెం పూడిశేషారావు, పుట్టా రామారావు, కామన బ్రహ్మయ్య ,గడ్డం పిచ్చియ్య, సందడి రమణయ్య, సందడి కొండయ్య ,రాయపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



సానా శ్రీనివాస్‌రెడ్డి



ముప్పరాజు చిన్నబ్రహ్మయ్య

జిల్లా మహాసభలు జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-కురిచేడు

దర్శిలో నవంబర్ 7, 8, 9వ తేదీల్లో నిర్వహిస్తున్న సిఐటి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు డివిజన్ నాయకుడు సందు వెంకటేశ్వరరావు కోరారు. జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970లో ఐక్యత పోరాటం నినాదంతో ఏర్పడిన సిఐటియు కనీస వేతనాలు ఉద్యోగ భద్రత కోసం పోరాడుతుందన్నారు. మహాసభల్లో కార్మికులు ఉద్యోగుల విస్తతంగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ నాయకులు గౌసియా, అంజలి, నాగమణి, నాగేంద్ర, పంచాయతీ వర్కర్ నాయకులు ఎల్.అశోక్‌కుమార్, నాయకులు కెవి.పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి - చీమకుర్తి

అక్రమ లేఅవుట్లు వేసిన యజమానులు వెంటనే క్రమబద్ధీకరించుకోవాలని గుంటూరు ఆర్‌డిడిటిపి (రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ టౌన్ అండ్ ప్లానింగ్)టిపి పి.మధు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో లేఅవుట్ యజమానులు, డెవలపర్స్, ప్లాట్ల అమ్మకం మరియు కొనుగోలుదారులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన. మాట్లాడుతూ చీమకుర్తి పట్టణ పరిధిలో 48 లేఅవుట్లు ఉన్నాయని, అందులో 21 లే అవుట్లను క్రమబద్ధీకరించారని పేర్కొన్నారు. మిగిలిన 27 లేఅవుట్లు వివిధ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. అక్రమ లేఅవుట్లలో భవన నిర్మాణ పనులకు అనుమతి లేదన్నారు. రోడ్లు, కాలువలు, వీధిలైట్లు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించబడవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఎ పవన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వై. రామకష్ణయ్య, టిపిఒ శారద, ఎల్‌టిడిపిలు, సిబ్బంది, లేఅవుట్ యజమానులు, డెవలపర్స్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ మధు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ : రైలు నుంచి జారిపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శింగరాయకొండ – టంగుటూరు రైల్వే స్టేషన్ల మధ్య గురువారం చోటుచేసుకుంది. ఒంగోలు జిఆర్‌పి ఎస్ఐ కె.మధుసూదన్‌రావు తెలిపిన వివరాలు ప్రకారం. గుర్తుతెలియని సుమారు 40 సంవత్సరాల వయస్సు వ్యక్తిరైలు నుంచి జారీ పడి మృతిచెందాడు. మృతుడిని గుర్తించేందుకు మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల : టైరు పేలడంతో కారు అదుపు అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలోని శ్రీశైలం మార్గంలోని ఈద్గా వద్ద గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాలు ప్రకారం.. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన శివరామయ్య, ఆయన భార్య పద్మ, కుమారుడు రేవంత్, కుమార్తె రోహిణి కలిసి శ్రీశైల మల్లన్న దర్శనం కోసం కారులో బయలుదేరారు. ఈద్గా వద్దకు వచ్చిన తరువాత టైరు పేలడంతో కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. క్షతగాత్రులను పెద్దదోర్నాలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ వి. మహేష్ కేసు నమోదు చేఉసి దర్యాప్తు చేస్తున్నాడు.

మందుబాబులు అరెస్టు

ప్రజాశక్తి-టంగుటూరు : పొలాల్లో మద్యం సేవించి రైతులకు ఆటంకం కలిగిస్తున్న ఆకతాయిలను ఎస్ఐ నాగమల్లీశ్వరరావు గురువారం అరెస్టు చేశారు. ఎస్ఐ హర్షవర్ధన్ రాజు ఆదేశాలమేరఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సిఐ సిహెచ్‌జ హాజరతయ్య ఆధ్వర్యంలో టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

20న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- పిసిపల్లి : కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో ఈనెల 20న ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న పిసిపల్లి పిఎసిఎస్ డైరెక్టర్ ఉండేల పిచ్చిరెడ్డి ఓ ప్రకటన తెలిపారు. జనని చారిటబుల్ ట్రస్ట్, శంకర్ కంటి హాస్పిటల్, జిల్లా అంథత్వ నివారణ సంస్థ ,మరియు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలువైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

ప్రజాశక్తి -చీమకుర్తి : యూరియా కోసం ఆందోళన చెందవద్దని చీమకుర్తి విశాల సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్ పూనాటి వెంకట్రావు తెలిపారు. ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రైతులకు నాలుగు టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. యూరియా గురువారం మండలానికి వచ్చినట్లు తెలిపారు. మండల పరిధిలోని ముvvవారి పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోమరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని ఎంఇఒ నరసింహారావు కోరారు. ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశీలించి, తగు చర్యలు తీసు కుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు,ఎంపిడిఒ రాఘ వేంద్రరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి -మద్దిపాడు : : మద్దిపాడులోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీవో జ్యోతి గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయని ఈ సందర్భంగా ఎంపీటీవో దష్టికి వచ్చింది. అందులో భాగంగా ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎంపిడిఒ మధ్యాహ్న భోజనం చేశారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు

21న పంచాయతీ కార్మికుల సభ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలో వివిధ పంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు అందరూ ఈ నెల 20న స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం జరుగుతుందని సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు తెలిపారు. ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు శ్రీను, సుబ్బారావు, చెంచారావు, జ్యోతి, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు, కార్మిక నాయకులు

21న సిఐటియు మహాసభలు

ప్రజాశక్తి - అద్దంకి

ఈ నెల 21న జరిగే సిఐటియు మండల మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పి తిరుపతి రెడ్డి, తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో సభ జరుగుతుందని తెలిపారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మికవర్గ ప్రయోజనాల కోసం నిరంతరం సిఐటియు కృషి చేస్తుందని తెలిపారు. గత మూడేళ్లలో కార్మిక వర్గం నిర్వహించిన పోరాటాలు సమీక్షించుకొని భవిష్యత్ కార్యాచరణ రూపొందించు కునేందుకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఐటియు జాతీయ మహాసభలు డిసెంబర్ 31, జనవరి 1, 2, 3, 4 తేదీల్లో మొట్ట మొదటి సారి విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి ఆదాం, మున్సిపల్ వర్కర్ యూనియన్ కార్యదర్శి ఉసురుపాటి శామ్యూల్, దాసరి వీరయ్య పాల్గొన్నారు.



చెత్త సేకరణ వాహనాలు ప్రారంభిస్తున్న అమర్నాథ్

పారదర్శకత కోసమే స్మార్ట్ కార్డులు

ప్రజాశక్తి - చీరాల

ప్రజా పంపిణీ సరుకులు పక్కదారి పట్టకుండా లబ్ధిదారులు నేరుగా రేషన్ బియ్యం అందించేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని టిడిపి అధికార ప్రతినిధి ఎం అమర్నాథ్ అన్నారు. మండలంలోని దేవాంగపురిలో ఆయన స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేశారు. అదే విధంగా గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు నూతన చెత్త సేకరణ వాహనాలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దారు గోపి కృష్ణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి గీతా, మాజీ ఎంపిటిసి శిద్ది బుచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు చలో వైద్య కళాశాల

ప్రజాశక్తి - అద్దంకి

బాపట్ల వైద్య కళాశాల ప్రైవేటీకరణకు నిరసనగా వైసిపి ఛలో వైద్య కళాశాల కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తుందని, వైసిపి కార్యకర్తలు ప్రజలు తరలి రావాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ కోరారు.



డాక్టర్ అశోక్ కుమార్

వైద్య కళాశాల ప్రైవేటుకు ఇవ్వడం దుర్మార్గం

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల వైద్య కళాశాల నిర్మాణం ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. వైద్య కళాశాల ప్రవేటుకు అప్పగిస్తే బాపట్ల ప్రాంత అభివృద్ధి కుంటు పడటంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేదల విద్యార్థులకు వైద్య విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని అన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్మాణ దశలో ఉన్న వైద్య కళాశాలను పరిశీలించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలు ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే యోచన చంద్రబాబు విరమించుకోవాలని అన్నారు. బాపట్ల వైద్య కళాశాల ప్రైవేట్ పరం చేస్తే పేద విద్యార్థులు డాక్టర్లు కావాలన్న కల కలగానే మిగిలిపోతుందని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన రిజర్వేషన్లను కోల్పోయే పరిస్థితి వస్తుందని అన్నారు. వైద్య కళాశాలను పీపీపీ విధానంలో నిర్మించాలనే ప్రతిపాదన తెరపైకి తేవడం ప్రైవేటు సంస్థల నుండి కేవలం లంచాలతో పాటు ఒక సామాజిక వర్గం అభివృద్ధి కోసమేనని అన్నారు. వైద్య సీట్లన్నీ ప్రైవేటు వ్యక్తులకు సీఎం చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు అమ్ముకొనే అవకాశాలు ఉన్నాయని ఆరోపించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుదే రాజారావు మాట్లాడుతూ చంద్రబాబు తన కేబినెట్లో ఉన్న మంత్రి నారాయణ, విద్యా సంస్థలు నడుపుతున్న వారికి మెడికల్ కళాశాలు ధారాదత్తం చేయడానికి ప్రయత్నం చేస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలను ఖండిస్తున్నట్లు తెలిపారు. భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు కొచ్చర్ల వినయ్ రాజు, కుల నిర్మూలన పోరాట సమితి పట్టణ కార్యదర్శి కోలా శరత్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య, కె నాగేశ్వరరావు, వై భాస్కరరావు, బిఎస్‌పి నాయకులు ఏపూరి జోసెఫ్ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

పిఆర్‌సి అమలు చేయాలని కార్మికుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - అద్దంకి

మున్సిపల్ కార్మికులకు 12వ పిఆర్సి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన ధర్నా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. సిఐటియు నాయకులు పి తిరుపతిరెడ్డి, తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం సంవత్సరం కాలం నుండి దశల వారీగా కార్మికులు ఆందోళన, పోరాటాలు చేస్తున్నారని అన్నారు. డిమాండ్స్ చిత్తశుద్ధితో పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో మరొకసారి కార్మికులు ఆందోళన పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి ఆదాం, ఉసురుపాటి శామ్యూల్, కోశాధికారి జ్యోతి వెంకటరావు, జాన్, దాసరి వీరయ్య, ప్రసన్న, ఎం కోటేశ్వరరావు, జ్యోతి రాఘవయ్య, కృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

చీరాల : మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేసి, పేర్మినెంట్ కార్మికులకు డిఎ బకాయిలు తక్షణం విడుదల చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు కన్వీనర్ ఎం వసంతరావు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. గత మూడేళ్లుగా వేతనాలు పెంచకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ మేనేజర్ శ్రీనివాసన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి ఇమ్మానియేలు, నాయకులు చిమట వీరస్వామి, నూతలపాటి రాజు పాల్గొన్నారు.



చీరాలలో వినతి పత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

జీవాల పెంపకందార్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బాపట్ల

గొర్రెలు, మేకల పెంపకం దారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకం సంఘం రాష్ట్ర కార్య దర్శి పూసపాటి వెంకట్రావు కోరారు. జివాల పెంపకం దారుల సమస్యలపై స్థానిక పుచ్చల పల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా విస్తృత సమావేశం గురువారం నిర్వహించారు. గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకం దారులు తమ సమస్యలపై ఐక్యంగా కృషి చేయాలని అన్నారు. సంఘం సహాయ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడారు. గత ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి బుర్రి ఆంజనేయులు ప్రతిపాదించిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రధానంగా జీవాలు రోగాల బారిన పడితే అవసరమైన మందులు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. ఏడాదికి 4సార్లు నట్టల మందులు ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన జీవాలకు పరిహారం ఇవ్వాలని అన్నారు. జివాల కాపరులకు ఉచిత బీమా అమలు చేయాలని అన్నారు. 50శాతం సబ్సిడీతో నాబార్డ్ ద్వారా గొర్రెలు, మేకల పెంపకానికి రుణ సదుపాయం కల్పించాలని అన్నారు. పొలాలు ఎడారి ప్రాంతాల్లో మేతకు వెళ్లే జీవాలకు అవసరమైన నీరు పశుగ్రాసం సరఫరా చేయాలని అన్నారు. పెంపకం దారులపై దాడులు అరికట్టడానికి సామాజిక రక్షణ చట్టం చేయాలని తీర్మానాలు చేశారు. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ డిడి వేణుగోపాలరావు, లీడ్ బ్యాంకు మేనేజరు శ్రీకృష్ణకు మేకలు, గొర్రెలు పెంపకం దారులకు అందించే రుణాల సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వృత్తి దారుల సంఘం జిల్లా కన్వీనర్ పి కొండయ్య, వీరాస్వామి, వెంకటేశ్వర్లు, దబ్బకూటి ఎల్లమంద, మసనం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిఎంపిఎస్ నాయకుఉలు వెంకట్రావు



మాట్లాడుతున్న సిఐటియు ఉపాధ్యక్షులు ఎం వసంతరావు

ఐక్య పోరాటంతో హక్కుల సాధన

ప్రజాశక్తి - వేటపాలెం

ఐక్య పోరాటాలతోనే హక్కులు, సౌకర్యాలు సాధించుకోవచ్చుని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం వసంతరావు అన్నారు. మండలంలోని రామన్నపేట ఆక్వా అసోసియేషన్ భవనంలో గురువారం జరిగిన సిఐటియు మండల 4వ మహాసభలో ఆయన మాట్లాడారు. ఇండ్ల బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా అమరులకు నివాళులర్పించారు. అనంతరం వసంతరావు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ప్రారంభమైన కార్పొరేట్ ప్రోత్సాహక విధానాలను ప్రస్తుత కూటమి కొనసాగిస్తోందని విమర్శించారు. రూ.వేల కోట్ల విలువైన భూములు కార్పొరేట్లకు అప్పగించబడటం వల్ల ప్రభుత్వ ఆదాయం కోల్పోవడం మాత్రమే కాదని, కార్మికుల జీవన భద్రత ప్రమాదంలో పడుతోందని అన్నారు. సిఐటియు నాయకులు నలతోటి బాబురావు మాట్లాడుతూ కొత్త లేబర్ కోడ్స్ ప్రకారం యూనియన్ల ఏర్పాటు కఠినతరం అవుతుందని అన్నారు. కార్మికులు తమ సమస్యలు ఏకమై చెప్పే అవకాశం తగ్గిపోవచ్చని అన్నారు. అనంతరం మచ్చ అయ్యప్పరెడ్డి కన్వీనర్‌గా, తన్నీరు శ్రీనివాసరావు కో కన్వీనర్‌గా, ఇండ్ల బ్రహ్మయ్య, కరి ఆంజనేయులు తోపాటు మరో 15 మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



బౌద్ధ స్తూపం పరిశీలిస్తున్న ఎంపి టి కృష్ణ ప్రసాద్

బౌద్ధ స్తూపం సందర్శన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు బౌద్ధ స్థూపాన్ని బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలు ప్రాచీన బౌద్ధ వారసత్వానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి కేంద్ర నిధులు సమకూర్చి, ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని రైల్వే స్టేషన్లు, అవసరమైన ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి తనుకుంట్ల సాయిబాబా, ఎడ్ల జయశీలరావు ఉన్నారు.



సుధాకర్‌ను సత్కరిస్తున్న ఏలూరి సాంబశివరావు

క్రిబ్కో ఛైర్మన్ సుధాకర్‌తో ఏలూరి భేటీ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

క్రిషక్ భారతి కో ఆపరేటివ్ లిమిటెడ్ (క్రిబ్కో) నూతన ఛైర్మన్‌గా నియమితులైన విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్ చౌదరికి శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని ఆయన నివాసంలో కాకర్ల సురేష్‌తో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. నిబద్ధత, నిజాయితీతో వ్యాపార రంగంలో విశిష్ట స్థానం సంపాదించిన సుధాకర్ చౌదరికి అరుదైన గౌరవం లభించడం గొప్పవిషయమని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేసే అవకాశం వచ్చిందని, మరిన్ని ఉన్నత పదవులు చేయాలని ఆకాంక్షించారు.



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ఎన్నికల హామీలు విస్మరించిన మోడీ

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ళ క్రితం ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ విమర్శించారు. స్థానిక మీడియా కెమెరామెన్ అసోసియేషన్‌లో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో చింతా మోహన్ మాట్లాడుతూ 11 ఏళ్ల క్రితం ఎన్నికల్లో బిజెపి రెండు వాగ్దానాలు ఇచ్చిందని, ప్రతి ఇంటికీ 15 లక్షల రూపాయలు ఇస్తామని ఇప్పటివరకు నయా పైసా రాలేదన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి 11 ఏళ్లలో 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. నిరుద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, ఎంటెక్ చదివిన నిరుద్యోగులు డ్రైవర్లుగా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏంబిఏ, బిఏ చదివిన నిరుద్యోగులు పారిశుధ్య కార్మికులుగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో కంటే, తమిళనాడులో పెట్రోల్, డీజిల్ ఎనిమిది రూపాయలు తక్కువ ఉందన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జైలులో పెట్టలేదని, వ్యవస్థ అతనిని జైలులో పెట్టిందన్నారు. పరిపాలనలో పొరపాట్లు జరిగితే, ఇలాగే ఉంటుందని తెలిపారు. యుపిఏకు మద్దతు ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కూతురు కనిమొళి కూడా జైలుకు వెళ్లారని, అయినా స్టాలిన్ కాంగ్రెస్ తోనే ఉన్నారని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు విజేంద్ర బహుజన్, పీకా మధుసూదనరావు, మన్నం ప్రసన్న రాజు పాల్గొన్నారు.



గుర్తించిన ప్రదేశాలను బాగు చేయిస్తున్న సిఐ విజయకృష్ణ

బహిరంగ మద్యపానం జరగకుండా చర్యలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వుల మేరకు ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో బహిరంగ మద్యపానం జరగకుండా సిఐ టి.విజయకృష్ణ గురువారం నాడు చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ప్రదేశాలను గుర్తించి వాటిని జెసిబి మరియు సిబ్బందిని కేటాయించి దగ్గరుండి బాగు చేయించారు. సదర్ ప్రదేశాలు క్లీన్‌గా స్వచ్ఛంగా ఉండేటట్లుగా చేసి.. అక్కడ మరలా బహిరంగ మద్యపానం జరగకుండా చర్యలు తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని పట్టుకొని వారిపై పెట్టీ కేసులు బుక్ చేసి.. కోర్టులో హాజరుపరుస్తామని సిఐ హెచ్చరించారు.

ఎస్‌బిఐలో వినూత్న పథకాలు: ఆర్‌ఎం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్నో వినూత్న పథకాలను అమలు చేస్తోందని ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా రీజనల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఒంగోలులో టౌన్ హాల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్‌బిఐ గుంటూరు పరిపాలనా కార్యాలయ చీఫ్ మేనేజర్ సంజీవ్ కుమార్ బన్సల్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం వెల్లంకి శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల హక్కుల పరిరక్షణకు ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. ఖాతాదారులు సులభంగా బ్యాంక్ సేవలు పొందేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామన్నారు. వాట్సాప్ ద్వారా బ్యాంక్ సేవలు అందిస్తున్నామని, టోల్ ఫ్రీ నంబర్ ద్వారా బ్యాంకింగ్ సేవలు అందుబాటులోనికి తీసుకువచ్చామన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న సంజీవ్ కుమార్ బన్సల్ మాట్లాడారు. చిరిగిపోయిన,పాడైపోయిన నోట్లను తమ బ్యాంక్ శాఖలలో సులభంగా మార్పిడి చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో ఆర్‌బిఓ చీఫ్ మేనేజర్లు కె.రవికుమార్, వేదం రాజేష్ బాబు, కె.హారతి, హెచ్‌ఆర్ మేనేజర్ ఎఎన్‌విఎస్ నళినీకాంత్, కె.జానకిరామయ్య, అసోసియేషన్ నాయకులు వి.శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాసరావు, అవార్డు యూనియన్ నాయకులు వి.ఎస్.ఆర్.సుధాకర్, పి.వెంకటరెడ్డి, పెద్ద సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

మహిళలపై నేరాలకు పాల్పడితే చర్యలు

- మత్తుపదార్థాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం..
- ఎస్పీ బి.ఉమామహేశ్వర్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. బాపట్ల పట్టణ, గ్రామీణ పోలీస్ స్టేషన్లను, బాపట్ల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్, కార్యాలయాల పరిసరాలను పరిశీలించి, క్రైమ్ రికార్డ్‌లను పరిశీలించారు. స్టేషన్‌ల పరిధిలో ఎక్కువగా జరిగిన నేరాల గురించి పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని నేర సమాచారాన్ని, కేసులలో పురోగతి, ఛార్జ్ షీట్ దాఖలు తదితర వివరాలను సీసీటీఎన్‌ఎస్‌లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ వేగవంతంగా నేరాలను చేదించాలన్నారు. నేరాలను కట్టడి చెయ్యడంపై ప్రధానంగా దష్టి సారించాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుండి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించరాదని తెలిపారు. మహిళలు, చిన్నపిల్లల పట్ల ఎవరైనా అమర్యాదగా వ్యవహరించిన, కించపరిచే విధంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంబంధిత కేసుల దర్యాప్తును వేగవంతంగా నిర్వహించాలని సూచించారు. మహిళా సంబంధిత పిర్యాదులు స్వీకరించడానికి ఏర్పాటు చేసిన మహిళా సహాయ కేంద్రంలో తప్పని సరిగా మహిళా పోలీస్ అధికారి విధులు నిర్వహించాలన్నారు. అనంతరం బాపట్ల పట్టణంలో పర్యటించి ట్రాఫిక్ సమస్యల గురించి తెలుసుకొని అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని ప్రధాన పర్యాటక ప్రాంతాలైన సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్ లకు అధిక సంఖ్యలో యాత్రికులు వస్తుంటారన్నారు. అదే వారాంతాలు, సెలవు దినాలలో వారి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. దానిని దష్టిలో ఉంచుకొని ఆ ప్రాంతాలలో యాత్రికులకు కల్పించవలసిన భద్రతా ఏర్పాట్ల గురించి అధికారులకు తగిన సూచనలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బాపట్ల డిఎస్పీ జి.రామాంజనేయులు, బాపట్ల ఎస్.బి సిఐ జి.నారాయణ, బాపట్ల పట్టణ, రూరల్, బాపట్ల రూరల్ సర్కిల్ సిఐ లు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై

వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలి

అధికారులకు డిఆర్ఓ ఓబులేషు ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఓ ఓబులేషు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో హైదరీ క్లబ్ వద్ద రూ.100 కోట్ల విలువైన వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ స్థలం కబ్జా చేసి.. ఆ స్థలంలో ఇటీవల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారన్న ఫిర్యాదుల నేపథ్యంలో.. దీనిపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను డిఆర్ఓ ఓబులేషు ఆదేశించారు. కబ్జాను అడ్డుకొని విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని పట్టణ ప్రజా సంఘాల వారు ఈ నెల 8న గ్రీవెన్స్ సెల్ నందు జిల్లా కలెక్టరుకి వినతిపత్రం ఇచ్చారు. విషయాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా రెవిన్యూ అధికారి ఓబులేసు ఒంగోలు మండల తహశీల్దార్ మధుసూదన్, నగరపాలక సంస్థ ఎసిపి సుధాకర్, ప్రజా సంఘాల వారితో సమావేశమయ్యారు. ప్రజా సంఘాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా సమగ్ర విచారణ చేసి ఒక వారం రోజులలో నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టరు పి. పేరయ్య, అఖిల భారతీయ బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ, ఇండిపెండెంట్ లేబర్ పార్టీ దాసరి సుందరం, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు యం.జార్జి తదితరులు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ భూముల పరిశీలన

- మంగళ కుంట రెవెన్యూలో 603.00 ఎకరాలు
- కలుజువ్వలపాడులో 150 ఎకరాలు కేటాయింపు



భూములు పరిశీలిస్తున్న జేసీ, సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి-తర్లుపాడు

రిలయన్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో ఏర్పాటు చేయనున్న బయోగ్యాస్ (సిబిజి) ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం తర్లుపాడు మండలంలో 753.00 ఎకరాల కేటాయించింది. మండలంలోని మంగళకుంట రెవెన్యూ ఇలాఖలో 195 సర్వే నెంబర్ లోని 1428.80 కొండ పోరంబోకు భూమిలో 195/3లో 180 ఎకరాలు, 195/4లో 180 ఎకరాలు, 195/5లో 213 ఎకరాలు, కలుజువ్వలపాడు రెవెన్యూ ఇలాఖా లోని సర్వే నెంబర్ 86 లోని 379.40 ఎకరాలలో 86/4 లో 150 ఎకరాల కొండ భూమిని.. విడతల వారీగా మొత్తం 753 ఎకరాల భూమిని ప్రభుత్వం రిలయన్స్ బయోగ్యాస్ లీజుకు ఇవ్వడానికి కేటాయించింది. ఈ భూమిని జాయింట్ కలెక్టర్ (జె.సి) ఆర్.గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, మండల తహసిల్దార్ కేకే కిషోర్ కుమార్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరలో ఈ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం ప్రకటించడంతో రిలయన్స్ ప్రతినిధులు భూసేకరణతో పాటు ఇతర పనులు వేగవంతం చేస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో షరీఫ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జనన, మరణాల నమోదులో జాగ్రత్తలు తీసుకోండి

పలు విభాగాలు పరిశీలించి చీఫ్ రిజిస్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జనన, మరణ వివరాలు నమోదు, రికార్డుల భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చీఫ్ రిజిస్టర్ శ్రీనివాసరావు జిజిహెచ్ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా కచ్చితమైన మరణ, జనన ధవీకరణ పత్రాలు అందించాలని ఆయన సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన జి జి హెచ్ లో పలు విభాగాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. మెడికల్ రికార్డ్ విభాగంతో పాటు జనన మరణ నమోదు, పంపిణీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భగా జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్య రావు, సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ మాధవీ లత, జిల్లా గణాంక అధికారి పివి ప్రసాద్, మెడికల్ రికార్డ్ ఇన్‌ఛార్జి ప్రసాదరావు, ఎం ఆర్ డి టెక్నీషియన్ శ్రీనివాసరావు, జిల్లా గణాంక అధికారులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

వికలాంగులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో ఐసీసీ సోషల్ యాక్ట్ దివ్యాంగుల వసతి గహంలో దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ మహబూబ్ ఆధ్వర్యంలో వికలాంగులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మానవతా సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ దివ్యాంగులకు కావాల్సింది సానుభూతి కాదని, సహకారం అని అన్నారు. ముఖ్యఅతిథి బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షులు మరియు సినీ నటులు దన్నారపు మస్తాన్ రావు మాట్లాడుతూ దోస్తీ ఫౌండేషన్ ద్వారా మహబూబ్ పేదలకు వద్ధులకు దివ్యాంగులకు అండగా ఉంటున్నారని చెప్పారు. పేద దివ్యాంగురాలు శివ పార్వతికి కాలేజీ ఫీజులు కు అయ్యే ఖర్చు 22 వేలు ట్రస్ట్ ద్వారా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నత్తల శ్రీనివాస్ జిల్లా కోర్టు ఎంప్లాయ్ శ్రీనివాసరెడ్డి యూనియన్ బ్యాంక్ ఎంప్లాయ్ రాజేంద్ర, చక్రపాణి, వసతి గహ నిర్వాహకులు శివ రామకష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కంట్రోల్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రకాశం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న ఐటీ కోర్ సెంటర్, కంట్రోల్ రూమ్ సెంటర్లను గురువారం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, సందర్శించారు. అక్కడ సిబ్బంది పని తీరు, వారి విధులు గురించి ఆరా తీశారు. సి.సి.టి.యన్.యస్, సిడిఆర్, సైబర్ క్రైమ్‌కు సంబంధించిన తాజా అప్డేట్స్, అప్లికేషన్లపై సిబ్బందితో చర్చించి, పలు ఫైల్స్ ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్లలో నమోదు అయిన కేసుల్లో దర్యాప్తుకు ఉపయోగపడే కీలక ఆధారాలను సాంకేతికత ద్వారా త్వరితగతిన అందించాలని సూచించారు. ఎస్పీ వెంట ఐటి కోర్ సీఐ సూర్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

కంభంలో నకిలీ కరెన్సీ నోట్ల కలకలం

ప్రజాశక్తి-కంభం

కంభంలో నకిలీ 500 రూపాయల నోట్లు కలకలం రేపాయి. ఈ నెల 2న తన బ్యాంకు ఖాతాలోకి నగదు జమ చేసుకునేందుకు వచ్చిన శ్రీను అనే వ్యక్తి వద్ద రూ.20,500 నకిలీ నగదును బ్యాంక్ అధికారులు గుర్తించారు. అవి నకిలీవా, కాదా.. అని తెలుసుకొనేందుకు పరీక్షలకు పంపగా.. అవి నకిలీవేనని తేలడంతో గురువారం నాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంభం పోలీసులు శ్రీనుపై కేసు నమోదు చేశారు. నకిలీ నోట్లు అతనికి ఎలా వచ్చాయనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మల్లికార్జున తెలిపారు.

ఎజిపిగా కొల్లా నరేంద్ర

ప్రజాశక్తి - పర్చూరు

పర్చూరు కోర్టు ఎజిపిగా కొల్లా నరేంద్రకుమార్ నియమితుల య్యారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ న్యాయవాది గా ఆయన పనిచేస్తున్నారు. ఎజిపిగా నియమితులైన ఆయన ను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు అభినందించారు. పలువురు న్యాయవాదులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.



కొల్లా నరేంద్రకుమార్



మెటీరియల్ అందజేస్తున్న జడ్పిటిసి ఉదయభాస్కరి

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అద్దేపల్లిలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా 3వ కేంద్రంను జెడ్పిటిసి తిరువీదుల ఉదయ భాస్కరి, బాలాజీ గురువారం ప్రారంభిరు. ఈ సందర్భంగా ఆమెను మాట్లాడుతూ మహిళలు అన్ని సేవా రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని అన్నారు. మహిళా సాధికారత ప్రాముఖ్యత వివరించారు. ఈ శిక్షణా తరగతులు బొలిశెట్టి జయబాబు ఆర్థిక సహకారంతో జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఎఫ్ఎ ఈసి సభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు, వంగర బాబూజీ, పసుపులేటి శివరామ ప్రసాద్, తిరువీదుల బాలాజీ, ట్రైనర్ నాగమణి పాల్గొన్నారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

ప్రజాశక్తి - చుండూరు

మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో ఆలపాటి వెంకట రామయ్య జెడ్పి ఉన్నత పాఠశాల 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆటో మోటార్స్ ఒకేషనల్ ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా తెనాలి సుల్తానాబాద్‌లోని ఇండస్ట్రియల్ పార్కులో గల కుమార్ పంప్స్ అండ్ మోటార్స్ ఇండస్ట్రీని సందర్శించారు. కుమార్ పంప్స్ అండ్ మోటార్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యంకు తెనాలి వివేకా విద్యాసంస్థల అధినేత నారాయణ, రావిపాటి వీరనారాయణ, పాఠశాల హెచ్‌ఎం కుర్ర శ్రీనివాసరావు, ఒకేషనల్ ట్రైనర్ తిరుపతిరావు ధన్యవాదాలు తెలిపారు.

చెరుకుపల్లి : విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పొందేందుకు పరికరాలను ప్రత్యక్షంగా పరిశీలించి వాటి పనితీరును తెలుసుకోవడం ద్వారా విషయ పరిజ్ఞానాన్ని పొందగలుగు తారని గుళ్ళపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోనేటి కవిత అన్నారు. కావూరులోని 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోనేటి కవిత, వృత్తి విద్య ఉపాధ్యాయులు కెవి రామారావు, బి ధ్యాన్ చంద్ర్, జె శ్రీవిద్య, పిటిఐ కె శివాంజినేయులు, విద్యుత్ డిఇ ఎన్ సురేష్ బాబు పాల్గొన్నారు.

ఇకేవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - కారంచేడు

స్థానిక భారత్ గ్యాస్ వినియోగదారులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇకేవైసి పూర్తి చేసుకోవాలని భారత్ గ్యాస్ మేనేజర్ నాతాని శ్రీనివాసరావు తెలిపారు. ఇకెవైసి చేయించుకోని వినియోగదారులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలు అందకపోవచ్చని చెప్పారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పర్చూరు

ప్రభుత్వ సర్వేలు సచివాలయ సిబ్బంది సకాలంలో పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వెంకటస్వామి సూచించారు. మండలంలోని అడుసుమల్లి, గొల్లపూడి సచివాలయాలను ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామాల్లో పరిశుభ్య పనుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గొల్లపూడిలో నారీ స్వస్థ హెల్త్ క్యాంపు సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కొసనా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - భట్టిప్రోలు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

పంట సాగు చేసిన కౌలు రైతుకే ఈ క్రాప్ నమోదు చేసి పంటలకు రుణాలు ఇవ్వాలని, ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా రైతు, కౌలు రైతులకు ఎరువులు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ క్రాప్ ఉన్నవారికి మాత్రమే ఎరువులు ఇస్తామని చెప్పడం సరైనది కాదన్నారు. ఈక్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభించకుండా, గ్రామాల్లో ఈ క్రాప్ చేయకుండా రైతు, కౌలు రైతులకు ఎరువులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. వెంటనే ఈక్రాప్ నమోదు ప్రారంభించాలని కోరారు. పంటవేసిన కౌలు రైతుకే ఈ క్రాప్ నమోదు చేసి అవసరమైన రుణాలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకర్ల నుంచి ఇవ్వాలని అన్నారు. యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. ఈనెల 22న కౌలు రైతులు సమస్యలపై రుణాలకు గుర్తింపు కార్డుల కోసం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చేస్తున్న ధర్నాకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియ జేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టి కృష్ణమోహన్, జి సుధాకర్, మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, దీపాల సత్యనారాయణ, పి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి అవసరం

ప్రజాశక్తి - బాపట్ల

పుస్తక భాండాగారాలైన గ్రంథాలయాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఎంఈఓ డి ప్రసాదరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఎంపిక సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది నిరుపేద నిరుద్యోగ యువకులు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదువుకుని ఉన్నతమైన ఉద్యోగాలు సాధించారని అన్నారు. గ్రంథాలయాలు ఎందరో యువకులు జీవితంలో స్థిరపడానికి ప్రధాన పాత్ర పోషించేవని అన్నారు. అలాంటి గ్రంథాలయం అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని అన్నారు. కమిటీ అధ్యక్షులు చాపల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు పిసి సాయి బాబా, కార్యదర్శి శేషాద్రి నాయుడు, సంయుక్త కార్యదర్శి బూర్లె రామసుబ్బారావు, కన్వీనరు, కోశాధికారి లైబ్రేరియన్ ఎ శివాజీ గణేషన్, సలహాదారు న్యాయవాది కళ్లం హరినాధరెడ్డి, కమిటీ సభ్యులు ఎవివి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై సత్యవతి, విశ్రాంత ఉపాధ్యాయులు జివి, బొమ్మిశెట్టి శివరామకృష్ణ, సిహెచ్ ఉపేంద్ర, గంటా శంకర్రావు, శీలం శ్రీనివాసరావు, కె నాగరాజు, శ్యాముల్‌తో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో నూతన గ్రంథాలయ భవనం నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి : వైసిపి

ప్రజాశక్తి - పర్చూరు



ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని వైసిపి ఇన్చార్జి గాదె మధుసూదనరెడ్డి కోరారు. తమ నాయకుడు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతన్నకు అండగా అన్నదాత పోరుబాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక బొమ్మలు సెంటర్లోని వైఎస్ఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. బొమ్మల సెంటర్ నుండి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలి నిర్వహించారు. అనంతరం తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు మెరుగ నాగార్జున, పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, ఇంకొల్లు, చినగంజాం మండలాల కన్వీనర్లు కటారి అప్పారావు, రావూరి వేణుబాబు, వీరయ్య చౌదరి, చిన్ని పూర్ణ చంద్రరావు, నాగేశ్వరరెడ్డి, బండారు ప్రభాకర్, చుండి బలరాం, బి శ్రీనివాసరెడ్డి, పాలేరు వీరయ్య, ముప్పాళ్ళ రాఘవయ్య, కోట శ్రీనివాసరావు, జంగా అనిల్, తోకల కృష్ణమోహన్, కొల్లా శ్రీహరి, తులసి శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యద్దనపూడి : ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు నిరసనగా వైసిపి ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి పర్చూరులో చేపట్టిన ర్యాలీకి వైసిపి కార్యకర్తలు తరలి వెళ్లారు.

ఫ్రెండ్లీ టాయిలెట్‌కు స్థలం పరిశీలన

ప్రజాశక్తి - కర్లపాలెం

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఫ్రెండ్లీ టాయిలెట్, ర్యాంప్ మంజూరైన నేపథ్యంలో నిర్మాణానికి స్థలం పరిశీలించినట్లు సమగ్ర శిక్ష ఎఇ నాగజ్యోతి తెలిపారు. స్థానిక ఇందిరానగర్లోని భవిత సెంటర్‌ను మట్ట జోత్స్నతో కలిసి సందర్శించారు. పాఠశాల హెచ్‌ఎం డి శైలజ, నరాలశెట్టి లక్ష్మీప్రసన్న, చెన్నుబోయిన చందన పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - అద్దంకి

సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధ్యమని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి రమేష్ అన్నారు. గోవాడ లో ఆయన మాట్లా డారు. ఎడిఎ బి ఎఫ్రాయిం, ఎఒ కొర్రపాటి వెంకట కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నిజాంపట్నం : యూరియా వాడకం తగ్గించాలని ఎఒ చుక్కా విజయరాజు సూచించారు. రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. సేంద్రియ, నానో ఎరువులు వాడాలని చెప్పారు.

రాజకీయంగా ఎదగాలి

ప్రజాశక్తి - రేపల్లె

విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ తొలిసారి పట్టణానికి వచ్చిన సందర్భంగా స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో ఆత్మీయ సత్కార సభ గురువారం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధి సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని అన్నారు. కార్పొరేషన్ ద్వారా స్వర్ణకారులు, చేతి వృత్తిదారులకు ఆర్థికంగా చేయూత అందించనున్నట్లు తెలిపారు. స్వర్ణకారులు వృత్తి రక్షణ కోసం త్వరలో రాష్ట్ర హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ డైరెక్టర్ కె శేష బ్రహ్మాచారి, పేడపల్లి ప్రసాదరావు, మాచర్ల ఫణికుమార్, రావూరి చంద్రశేఖర్, సత్యనారాయణ, బాలసుబ్రమణ్యం, కృష్ణ, మానేపల్లి నాగరాజు, ఎం వెంకటేశ్వరరావు, శివకుమార్, తరుణ్ కుమార్ పాల్గొన్నారు.



శతక పద్య పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ఉత్సాహంగా శతక పద్య పోటీలు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కోటపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శతక పద్య పోటీలు గురువారం గుర్రం వెంకటేశ్వర్లు తండ్రి రామలింగం స్మారకార్థం నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఇఒ జి వీరాంజనేయులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఎంతో మంది మహానుభావులు తమ అనుభవాలను శతక పద్యాల ద్వారా సమాజానికి అందించారని అన్నారు. కార్యక్రమంలో కోటపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వడ్లమూడి వేణుబాబు, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, పంగులూరు మోడల్ పాఠశాల (ఎస్టీ) హెచ్‌ఎం గుర్రం ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- పంగులూరు

ఎస్‌జిఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఎంఇఒ జి వీరాంజనేయులు గురువారం ప్రారంభించారు. వాలీబాల్, చెస్, కబడ్డీ, యోగ పోటీలు నిర్వహించారు. డిప్యూటీ డిఇఓ గంగాధర్ క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. చందలూరు హైస్కూల్ పూర్వ విద్యార్థి పెంట్యాల గోపికృష్ణ పాఠశాలకు అవసరమైన ఆట వస్తువులు బహుకరించారు. పాఠశాల హెచ్‌ఎం చందలూరు గిరిజ, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, పీడీలు కె మధుమూర్తి, ప్రతిమ పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - అద్దంకి

ఆటో డ్రైవర్లకు రూ.15వేలు జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మండలంలోని మణికేశ్వరం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఆటో యజమానులు సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆనందోత్సాహాలతో స్వీట్లు పంచుకున్నారు. ఐటిడిపి అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బడావలి, ఈసు, ఆదినారాయణ, రూబేను, రవీంద్ర, రవి, దాసు, ప్రసాద్, మహేష్, చినబాబు, పున్నయ్య పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదపులివర్రు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మానసిక కౌన్సిలర్ గంటా ఇందిరా ప్రియదర్శిని కెరీర్, ఆమనసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కౌతరపు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ పిల్లలు క్లాస్‌లో ఎలా ఉన్నారు? వాళ్ళ ప్రవర్తన గురించి ఓరియెంటేషన్ సెషన్‌లో డిస్ట్రిక్ట్ కౌన్సిలర్‌తో పంచుకున్నారు. అభ్యాస ప్రక్రియలో ఇబ్బందులను వ్యక్తిగత కౌన్సెలింగ్ ద్వారా తెలుసుకుని సలహాలు, సూచనలు చేశారని తెలిపారు. హెచ్‌ఎం సీతామహాలక్ష్మి కౌన్సెలింగ్ సెషన్స్ చూసి ప్రశంసించారు.

పౌష్టికాహారంతోనే పిల్లల ఎదుగుదల

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు సెక్టార్‌లో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని ఐలవరంలో గురువారం నిర్వహించారు. అమృతలూరు సిడిపిఒ ఎ లక్ష్మీ దేవి మాట్లాడుతూ పిల్లలు సమతుల ఆహారం తీసుకోవడం అవసరం అన్నారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదల ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సూపర్వైజర్ బి సంపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్లపాలెం : పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవితానికి ఎంతో ఉపయోగ పడుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ శేషు కుమారి అన్నారు. మండలంలోని గణపవరం సెక్టార్ పరిధిలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోషకాహారం వల్ల కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం వెంకటేశ్వరరావు, అంగన్‌వాడి కార్యకర్తలు హైమావతి, నాగమారుతి, రత్నకుమారి, లక్ష్మీ పాల్గొన్నారు.

చోరీ కేసులో ముద్దాయిలకు జైలు శిక్ష

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని పేటేరు శివారులోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో 2024 జూన్ 26న జరిగిన చోరీ ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్లో అప్పట్లో నమోదైన కేసులో చోరీకి పాల్పడిన ముగ్గురు ముద్దాయిలకు శిక్ష విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో న్యాయమూర్తి దేవి సాయి శ్రీవాణి గురువారం తీర్పు ఇచ్చారు. ముద్దాయిలు తాడిపర్తి సాయి, కారంపుడి విజయ కుమార్, బందికట్ల పవన కళ్యాణ్‌లకు 7నెలలు జైలు శిక్ష విధించినారు.

భట్టిప్రోలు : మండల కేంద్రం భట్టిప్రోలులోని శివాలయంలో గతేడాది జులై 12న జరిగిన చోరీలో కేసులో ముద్దాయికి జైలు శిక్ష విధించారు. అప్పటి ఘటనలో ఆలయంలో పూజకు సంబంధించిన 2.2కేజీల 10వెండి వస్తువులు దొంగిలించబడ్డాయని ఆలయ ధర్మకర్త కర్ణ శ్రీనివాసరావు పోలీసులకు పిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి చుండూరు సిఐ సిహెచ్ఎల్ఎన్ శ్రీనివాసరావు దర్యాప్తు చేశారు. 2024 ఆగష్టు 17న ఆలపాడు వంతెన వద్ద ఆభరణాలు దొంగిగించిన ముద్దాయిలు కారంపూడి విజయ్ కుమార్, తాటిపర్తి సాయి, బండికట్ల పవన్ కళ్యాణ్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సొమ్ము స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచారు. కేసు రేపల్లె న్యాయస్థానంలో విచారించారు. ముగ్గురిపై నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి దేవి సాయి శ్రీవాణి 7నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ ఎ శివయ్య తెలిపారు. కోర్టులో సీనియర్ ఎపిపి కూరగంటి జ్యోతి ప్రాసిక్యూషన్ నిర్వహించగా కోర్టు కానిస్టేబుల్ ఎలీషా బాబు సహకరించినట్లు తెలిపారు.

బాల్య వివాహాల నిరోధక చట్టం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - సంతమాగులూరు

స్థానిక వెలుగు కార్యాలయంలో విఒఎల సమావేశం గురువారం నిర్వహించారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమం గురించి సిడిపిఒ డి సుధ మహిళలకు వివరించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్టం గురించి, సుకన్య సమృద్ధి యోజన పథకం, బాలిక విద్యా ప్రాముఖ్యత, పోషణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాల నిరోధక చట్టం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం హనుమంతరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, సూపర్వైజర్లు జి ప్రమీల, ఎం సుష్మారాణి, బ్లాక్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి ఉమ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మండలంలోని చిమ్మిరిబండ ఎస్‌సి కాలనీకి చెందిన దుడ్డు కోర్నేలు పిడుగుపాటుకు గురై గురువారం పొలంలోనే మృతి చెందారు. గొర్రెల కాపరులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విఆర్ఒ తహశీల్దారుకు నివేదించారు. రైతు మృతితో కాలనీలో విషాదం అలుముకుంది.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని నాగులపాలెం నాగుబడి రంగయ్య, అచ్చమ్మ బదిరుల పాఠశాల్లోని విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. వీరన్నపాలెంకు చెందిన ఎన్నారై ఉమాదేవి 40మంది విద్యార్థులకు రెండు జతలు చొప్పున ఏకరూప దుస్తులు పంపిణీ చేసినట్టు హెచ్ఎం తెలిపారు.

కత్తితో దాడికి యత్నం

ప్రజాశక్తి - బాపట్ల

ఇరువురిపై ఓ వ్యక్తి పోలీసు స్టేషన్ ఎదుటే కత్తితో దాడికి యత్నించిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. జె పంగులూరు మండలం బూదవాడ గ్రామానికి చెందిన పూర్ణగంటి నరేష్ గత రెండు నెలలుగా బాపట్ల పట్టణం ఇందిరా నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అదే కాలనీకి చెందిన సమీప బంధువైన యెహూషువాకు అతని భార్యకు కుటుంబ కలహాల నేపథ్యంలో వివాదం జరిగింది. ఈ వివాదానికి నరేష్ భార్య కారణమని యెహూషువా భావించి నరేష్ భార్యతో వివాదం పెట్టుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై యెహూషువాపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అతని భార్య, బంధువులతో కలిసి పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. అతని బంధువులు స్టేషన్ వద్ద మాట్లాడుతుండగా మద్యం మత్తులో ఉన్న నరేష్ తన భార్యతో గొడవ పెట్టుకుంటావాని కత్తితో దాడి చేయబోయాడు. దీంతో మెరుపు వేగంతో స్పందించిన పోలీసులు నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించారు.

శిథిలావస్థలో పంచాయతీ భవనం

ప్రజాశక్తి - వేమూరు


శిథిలావస్థకు చేరిన కోడిపర్రు పంచాయితీ భవనం

మండలంలోని కోడిపర్రు పంచాయితీ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. దాదాపు 15ఏళ్ల నుండి ఈ కార్యాలయ భవనం కనీసం మరమ్మత్తులకు నోచుకోకపోవడం విచారకరమని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. 1989కి ముందు పెనుమర్రు పంచాయతీలో విలీనంగా ఉన్న కోడిపర్రు గ్రామం 1989లో విడిపోయి నూతన పంచాయతీగా ఏర్పడింది. అప్పట్లో పంచాయతీ కార్యాలయం ఏర్పాటుకు మొదటి సర్పంచ్ కంచర్ల రాజారత్నం, ఎమ్మెల్యే ఆలపాటి ధర్మారావు ఆధ్వర్యంలో ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అప్పటి సర్పంచ్ కంచర్ల రాజారత్నం తన సొంత స్థలాన్ని పంచాయతీ కార్యాలయానికి ఇచ్చి దానిలో పంచాయతీ భవనం నిర్మించి ప్రజలకు చేరువ చేశారు. ఈ భవనాన్ని 1993 అక్టోబర్‌లో అప్పటి రాష్ట్ర రవాణా, న్యాయశాఖ మంత్రి ఆలపాటి ధర్మారావు చేతులమీదుగా సర్పంచ్ పిల్లి ఇజ్రాయిల్, రాజుపాల్ ప్రారంభించారు. అప్పటి నుండి ప్రజలకు సేవలు అందించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలవస్తుకు చేరి విధులు నిర్వహించుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దీనివలన ఈ భవనం పాములు, కుక్కలకు నిలయంగా మారింది. సర్పంచ్‌గా ఎన్నికైన వారు వార్డు సభ్యులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నా రోడ్డుపై టెంటువేసి జరుపుకుంటున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఒక దశలో పంచాయితీ తీర్మానాలు కూడా రోడ్డు పైనే చేసుకుంటున్నారాంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. పంచాయితీ కార్యదర్శి కూర్చోవాలన్న ఏ చెట్టు కిందో కూర్చొని వెళ్లిపోతున్నాడని స్థానికులు చెబుతున్నారు. శిథిలావస్థకు చేరిన ఈ భవనంలో పాములు, జెర్రలు చేరి చుట్టుపక్కల గృహాల్లోకి ప్రవేశిస్తాయేమోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న పంచాయితీ భవనం స్థానంలో నూతన భవనం నిర్మించి ప్రజలు సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుచున్నారు. ఈ విషయంపై ఇన్చార్జి ఎంపిడిఒ చొప్పర శేఖర్ బాబు మాట్లాడుతూ భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని ఇప్పటివరకు పంచాయతీ కార్యదర్శి గాని, సర్పంచి గాని మండల అధికారుల దృష్టికి తీసుకురాలేదని అన్నారు. దీనిపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే చేనేత యాత్ర

ప్రజాశక్తి - భట్టిప్రోలు


చేనేత అధ్యయన యాత్ర ప్రారంభిస్తున్న నాయకులు

జాతీయోద్యమంలో కోట్లాది మంది ప్రజలకు స్ఫూర్తినిచ్చిన చేనేత పట్ల ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల ఫలితంగా చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతూడడంతో నేతన్నలు ఆకలి చావులకు బలి అవుతున్నారని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని భట్టిప్రోలు, రేపల్లె, ఇసుకపల్లి, ఐలవరం, కనగాల, రాజవోలు, చెరుకుపల్లి గ్రామాల్లో అధ్యయన యాత్ర నిర్వహించారు. యాత్రను భట్టిప్రోలులో సీనియర్ కార్మికుడు కౌతరపు పార్థసారథి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, కోశాధికారి బత్తూరి మోహనరావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు గజపల్లి వెంకట కృష్ణారావు, కొడాలి రామ కోటేశ్వరరావు, వెంకట లక్ష్మీ, కె వీరమోహనరావు, బి రామకృష్ణ, బాపయ్య, వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపల్లె : సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతున్న చేనేత కార్మికులను ఆదుకోవడం, సహకార సంఘాలను పరిరక్షించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు ఆరోపించారు. చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని, సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించవలసిన రూ.127.87 కోట్లను తక్షణమే చెల్లించి సంఘాలను కాపాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి నాగాంజనేయులు, చేనేత కార్మిక సంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గజవల్లి వెంకటకృష్ణ, బత్తూరి మోహనరావు, కొడాలి రామకోటేశ్వరరావు, కె పార్థసారథి, కె వీరమోహనరావు, వి శ్రీనివాసరావు, నాగేంద్రరావు పాల్గొన్నారు.

కేన్సర్ లక్షణాలు ముందే గుర్తించాలి

ప్రజాశక్తి - కారంచేడు


చీరాలలో మందులు పంపిణీ చేస్తున్న అమర్‌నాద్

క్యాన్సర్ లక్షణాలు ముందే ఏవిధంగా గుర్తించాలో స్థానిక సిహెచ్ఓ శాంతి ప్రియ వివరించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నందు స్వస్నారి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్సిడిసిడి 4.0 క్యాన్సర్‌ను గురించి వివరించారు. హెచ్‌బిఆర్‌బిఎస్‌బిపి వంటి రక్త పరీక్షలు నిర్వహించారు.

చీరాల : స్థానిక ఏరియా వైద్యశాల్లో సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎం అమర్నాథ్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సూపరడెంట్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సుభాషిణి పాల్గొన్నారు.

చెరుకుపల్లి : మహిళా ఆరోగ్యమే దేశ అభివృద్ధికి మూలమని కావూరు పిహెచ్‌సి డాక్టర్ సాలేహ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్వస్త నారి సశక్త పరి వార్ అభియాన్‌లో భాగంగా మండలంలోని రాంబోట్లపాలెం పంచాయతీ పిట్టుకోటిరెడ్డిపాలెంలో అవగాహన కల్పించారు. కిషోర్ బాలికలు, గర్భిణీ స్త్రీలు, మహిళలకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. బాల, బాలికలు, మహిళలతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వాణిశ్రీ, సూపర్వైజర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని గన్నవరంలో నారీశక్తి అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపిటిసి గొట్టిపాటి సతీష్ అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండలని అఅన్నారు. ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిని డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ఏ చిన్న సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, నాయకుడు రంగయ్య చౌదరి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - అద్దంకి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త, వ్యర్థ పదార్థాలు నిర్దేశించిన ప్రాంతాల్లోనే వేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని గరటయ్య కాలనీ వద్ద వ్యర్థ పదార్థాలను మున్సిపల్ కార్మికులు తొలగించే కార్యక్రమాన్ని అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం డంపింగ్ యార్డ్ పరిశీలించారు. టిడ్కో ఇళ్లను కమిషనర్ రవీంద్రతో పరిశీలించారు. సానిటరీ ఇన్స్‌పెక్టర్ బలరామిరెడ్డి పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మద్యాహ్నం 2నుండి సాయంత్రం 7గంటల వరకు వర్షం కురిసింది. దీనితో వర్షం మొదలైనప్పటి నుండే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్లు పనిచేయక పనులు నిలిచిపోయాయి. రాత్రి 8గంటలకు విద్యుత్ పునరుద్ధరించడంతో ప్రజల ఊపిరి పీల్చుకున్నారు.



సిహెచ్‌సిలో రక్తదానం చేస్తున్న దృశ్యం

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - పర్చూరు

రక్తదానం ప్రాణదానంతో సమానమని సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య అన్నారు. సిహెచ్‌సిలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. శిబిరానికి స్వచ్ఛందంగా వచ్చి 10 మంది రక్తదానం చేశారని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ నర్స్ సుందరి, జూనియర్ అసిస్టెంట్ బాషా, ల్యాబ్ టెక్నీషియన్ రమణ, చీరాల నుండి విచ్చేసిన బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఊబకాయం తగ్గించుకోవాలి

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని దేశాయిపేట సెక్టార్ నీలకంఠాపురం అంగన్‌వాడి పాఠశాలలో ఐటీసీ ఆధ్వర్యంలో స్కూల్ రీ ఓపెనింగ్, పోషణ మహా ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. వేటపాలెం సిడిపిఒ తిరుమలశెట్టి ఝాన్సీ, సూపర్వైజర్ పుష్పవల్లి, ఎఎన్ఎం సునీత, సిహెచ్ఓ ఏంజిల్, మహిళా పోలీసు కరుణ, పిచ్చుక బుల్లయ్య, పృథ్వి సుబ్బారావు, కొలుకుల వరప్రసాద్, పద్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

నిజాంపట్నం : మండలంలో పోషణ మాసం సందర్భంగా సిడిపిఒ ఎం అనసూయ మాట్లాడుతూ పిల్లల్లో వచ్చే ఉబకాయం తగ్గించాలని అన్నారు. జంక్ ఫుడ్ పరిచయం చేయకూడదని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి దీప్తి, డాక్టర్ సాయి కృష్ణ, టి సామ్రాజ్యం, ఎం అనసూయ, వెంకటరత్నం, బీపీసీ స్వప్న, పంచాయితీ సెక్రటరీ శివలీల, ఎంఎస్‌కె ఎం శ్రావణి, ఎంఎహెచ్ సౌజన్య పాల్గొన్నారు.

పిఎం ఆవాస్ యోజన రుణాలు

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో సొంతింటి కల నెరవేరే సమయం ఆసన్నమైందని మున్సిపల్ కమిషనర్ డి రవీంద్ర అన్నారు. విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. స్థలం ఉండి ఇంటి నిర్మాణం చేపట్టే వారికి ప్రభుత్వం రూ.2.50 లక్షల రుణం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిటీ లెవెల్ టెక్నికల్ అధికారిని జె లక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన దిగుబడులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని గూడవల్లిలో రైతు, శాస్త్రవేత్తల చర్చా గోష్టి గురువారం నిర్వహించారు. రిటైర్డు శాస్త్రవేత్త సివి రామారావు, శాస్త్రవేత్త కామాక్షి మాట్లాడుతూ రసాన ఎరువుల తగ్గించి సేంద్రియ, జీవ ఎరువులు వాడటం వల్ల ఆరోగ్యవంతమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. మత్తి భాస్కరరావు, ఎంఆర్‌కె మూర్తి, గూడవల్లి సొసైటీ చైర్మన్ ఆలపాటి నరేంద్ర, ఎఐలు మహేష్, రమేష్ పాల్గొన్నారు.

సరికొత్త టెక్నాలజీపై వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో సరికొత్త టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గురువారం నాడు వివిధ వర్క్ షాప్స్ నిర్వహించారు. సీఎస్ఈ, ఏఐఎమ్ఎల్ విద్యార్థులకు ఈ వర్క్ షాప్స్ ఏర్పాటు చేశారు. మెషిన్ లెర్నింగ్ ద్వారా యాప్‌ని ఎలా డెవలప్ చేయాలి అనే అంశంపై ఏఐఎమ్ ఎల్ విద్యార్థులకు శిక్షణ అందించారు. ఇండస్ట్రీ ఎక్స్ పర్ట్ అయినటువంటి ప్రియాన్ష శుక్లా దీనిపై ప్రత్యేక ప్రజంటేషన్ ఇచ్చి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. సీఎస్ఈ రెండో ఏడాది విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. సరికొత్త టెక్నాలజీపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు శిక్షణ అందించడంలో క్విస్ కళాశాల ఎప్పుడూ ముందు ఉంటుందని, విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి అనేక కార్యక్రమాలు నిత్యం నిర్వహిస్తూ ఉంటామని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ప్రవీణ, శివప్రసాద్, విజయలక్ష్మి, డాక్టర్ రాయుడు తదితరులు పర్యవేక్షించారు.



కమిషనర్‌కు అర్జీ ఇస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

భగత్‌సింగ్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో మౌలిక సదుపాయాల సమస్యలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి కె.ఎఫ్.బాబు తెలిపారు. గురువారం డివైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో కాలనీలోని సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నాయకులు బాబు సీఐటీయూ నాయకులు తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ భగత్‌సింగ్ కాలనీ మెయిన్ రోడ్డుతో లోపలి రహదారి కలుపుకునే ప్రాంతంలో సిమెంట్ రోడ్డు మరియు సైడ్ కాల్వల నిర్మాణం మధ్యలో ఆగిపోయిందని తెలిపారు. దీనికి కారణం ధరణి లక్ష్మణరావు అనే వ్యక్తి షాపులు, గదులు రోడ్డుకు అడ్డంగా ఉండటమేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ లో నివసిస్తున్నప్పటికీ, ఆయన అద్దెలకు ఇచ్చిన షాపుల వల్ల కాలనీలో రోడ్డు పనులు నిలిచిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకుని వెంటనే రోడ్డు పనులకు అడ్డంగా ఉన్న షాపులను తొలగించాలని కోరారు. భగత్‌సింగ్ కాలనీలో తక్షణం సిమెంట్ రోడ్డు, సైడ్ కాల్వలు నిర్మించాలని అన్నారు. కాలనీలో దోమలు అధికంగా వ్యాప్తి చెందాయని, వెంటనే బ్లీచింగ్ చల్లి, ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర నాయకులు కె.వంశీధర్, పి.రాంబాబు, పి.వెంకటరావు, రామకృష్ణ, యు.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ఎస్‌పిగా ఇటీవల భాద్యతలు చేపట్టిన హర్షవర్ధన్ రాజును ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎస్‌పి కార్యాలయంలో గురువారం కలిసిన ఎంపీ మాగుంట జిల్లా ఎస్‌పిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు శాంతిభద్రతల పరిరక్షణ, ఇతర రక్షణ సంబంధిత అంశాలపై చర్చించుకున్నారు.



ఎస్‌పిని సత్కరిస్తున్న ఎంపీ మాగుంట

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. గురువారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ టీ. మహేష్, యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ 12వ పిఆర్సి వెంటనే ప్రకటించాలని,పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను సవరిస్తూ మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గత సమ్మె కాల జీతాలు విడుదల చేయాలని, నాలుగు డిఏలు బకాయిలను చెల్లించాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులకు సరెండర్ లీవులు ఇవ్వాలని, సంక్షేమ పథకాలకు సంబంధించిన జీవోలు విడుదల చేయాలన్నారు..రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలి. ఇప్పటికే రిటైర్డ్ అయిన వారికి రిటైర్మెంట్ బకాయి బెనిఫిట్స్ అందించాలన్నారు.సేవలో ఉండగానే మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేల రూపాయలు, అలాగే కుటుంబానికి రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో పనిచేసిన కార్మికులను ఆప్కాసులోకి చేర్చాలన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం జాయింట్ మీటింగ్ వెంటనే ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో కార్మికులు కఠిన ఆందోళనలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షురాలు టీ. విజయమ్మ, కార్యదర్శి యు.కుమారి, కే.మోహన్‌రావు, ఎం. సింహాద్రి, ఎం. బాబు, భారతి, జాలమ్మ, కే. ఆనంద్, బి. సుబ్బారావు, అనిత, సునీల్, జి. మధు, ఎస్. రమాదేవి, అంకరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అంబేద్కర్ నాటకాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో 'సంఘం శరణం గచ్ఛామి' (హైదరాబాద్ బందం ప్రదర్శించనున్న) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితచిత్ర నాటకం సెప్టెంబర్ 20న పేర్నమిట్ట శాంతినగర్‌లోని కామ్రేడ్ నూకతోటి కోటయ్య కళా ప్రాంగణంలో జరగనుందని కేవీపీఎస్ నాయకులు తెలిపారు. నాటకాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గురువారం నాడు శాంతినగర్ అంబేద్కర్ గ్రంథాలయంలో మీడియా సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి. రఘురామ్ మాట్లాడారు. జ్ఞానవంతమైన సమాజ నిర్మాణం కోసం అంబేద్కర్ ఆలోచనలను ప్రతి ఇంటికి పరిచయం చేయడం అత్యవసరం అని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడని ప్రజల ముందు ఉంచేందుకు ఈ నాటకం ఉపయోగపడుతుందని తెలిపారు. సమావేశంలో సిఐటియు నాయకులు బంకా సుబ్బారావు, తుళ్ళూరు సుబ్బారావు, జూపూడి వీరనారాయణ, జార్జ్, అజయ్, సుమన్, యానాది తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ పిలుపు



నాటకానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

19 న మెగా డీఎస్సీ మేళా వాయిదా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విజయవాడలో శుక్రవారం డీఎస్సీ-2025 ఉపాధ్యాయులుగా ఎంపికయిన అభ్యర్థుల నియామక పత్రాలు అందించే మెగా డీఎస్సీ మేళా వాయిదా పడినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్ కుమార్ గురువారం తెలిపారు. నిన్నటి నుంచి కురుస్తున్న అకాల వర్షాల కారణంగా అననుకూల పరిస్థితులు ఏర్పడి మేళా కార్యక్రమాన్ని ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే అభ్యర్థులకు తెలియజేస్తామన్నారు.



ధర్నా చేస్తున్న విద్యార్థులు, నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.4,200 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలని పిడిఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సిహెచ్.శ్యామ్, నగర అధ్యక్షుడు వి. కోటి, జిల్లా నాయకులు కె. చంద్రశేఖర్, సుభాని, తేజ, పవన్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు

సమిష్టిగా పనిచేద్దాం..

- శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యంగా విధులు నిర్వర్తించాలి
- జిల్లాలో పారదర్శక, నిష్పక్షపాత పోలీసింగ్
- ప్రజల సమస్యల పరిష్కార కృషిపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దిశానిర్ధేశం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సమిష్టిగా పని చేద్దామని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వి.హర్షవర్ధన్‌రాజు గురువారం నాడు ప్రకాశం జిల్లాలోని అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సిఐలు తదితర పోలీసు అధికారులతో పోలీస్ కార్యాలయంలో గెలాక్సీ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ పరిధిలో గల పరిస్థితులు, భౌగోళిక ప్రదేశాల గురించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంశాలు, సర్కిల్ పరిధిలో పోలీస్ స్టేషన్ లు, వారు పనిచేయుచున్న కాలపరిమితి, జిల్లా సరిహద్దు ప్రాంతాల వివరాలు మరియు కేసులు ఎక్కువగా నమోదు అయ్యే ప్రాంతాల వివరాలు గురించి సంబంధించి అధికారులతో జిల్లా ఎస్పీ చర్చించారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీస్ అధికారి నిరంతరం అప్రమత్తంగా ఉండి, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తూ, జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, శారీరక దాడులు, దొంగతనాలను ప్రాధాన్యతగా గుర్తించి నివారించే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పేకాటలు, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు చేపట్టాలని, కీలక కేసులను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో వేగవంతంగా ట్రయల్స్ జరిపించి నిందితులకు శిక్షలు పడేలా కషి చేయాలని సూచించారు.

అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలైన పేకాట, కోడిపందాలు, మట్కా, సింగిల్ నంబర్ వంటివి జరగకుండా చర్యలు తీసుకుంటూ, ఎవరైనా వాటిని నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. చెడు నడత గల వ్యక్తులపై నిఘా వుంచాలని వారి యొక్క కదలికలను, దైనందిన జీవన విధానాన్ని, వారు చేసే పనులను పరిశీలించి, ఏవైనా అనుమానిత చర్యలు ఉంటే వెంటనే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా అందిపుచ్చుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కషి చేయడంతో పాటు గంజాయి మరియు మాదకద్రవ్యాల నిర్మూలనలో సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. డ్రోన్లు, సిసిటివి కెమెరాలు మరియు ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధన మరియు నేర నియంత్రణ వేగవంతం చేయాలని, డయల్-112కు వచ్చే కాల్స్‌పై వేగవంతమైన స్పందన ఉండాలన్నారు. నిర్ణీత సమయంలోనే నేర స్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం అందించాలన్నారు. పోలీస్‌స్టేషన్లకు వచ్చే మహిళలు, ప్రజల పట్ల గౌరవంగా వ్యవహరించి, సమస్యల పరిష్కారానికి జాప్యం లేకుండా కషి చేయాలన్నారు.

ఫిర్యాదు దారుల పట్ల మర్యాదపూర్వకంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించి, చట్టపరిధిలో వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. ఒకే సమస్య పునరావతం కాకుండా చట్టపరిధిలో సరైన పరిష్కారాన్ని చూపించాలని, మహిళ మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, అక్కడ వైరల్ అయ్యే సమాచారం నిజనిజాల ప్రకారమే ఉండేలా చూడాలని, అలాగే పోలీస్ అధికారులు విధులు నిర్వర్తించే తీరు ప్రజల్లో నమ్మకం కలిగించేలా ఉండాలని సూచించారు.

సమావేశంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీనివాసరావు, డిఎస్పిలు ఆర్.శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, కె. శ్రీనివాసరావు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాలూకా సిఐ విజయకృష్ణ



ఎస్‌పి హర్షవర్ధన్ రాజు